# గాలిమేడ

గరిమెళ్ళ సూరయ్యశాస్త్రిగారిది వ్యవసాయ కుటుంబం.

భార్యపోవడంతో ఇంట్లో ఆడ దిక్కులేదు. పెళ్ళికెదిగిన నలుగురు కొడుకులకోసం రకరకాల అమ్మాయిల్ని చూస్తున్నాడు శాస్త్రిగారు. ఐతే, జాతకం కలవకపోవడమో, కన్నొంకరవ్వడమో, కాలు సొట్టవ్వడమో వల్ల ఏ అమ్మాయీ నచ్చడం లేదు. ఏదోలోపం వెతుకుతా ఓ పట్టాన ఒప్పుకోడం లేదు సూరయ్యశాస్త్రి.

కొన్నాళ్ళకి, మా చుట్టుపక్కల ఊళ్ళల్లో అమ్మాయిలంతా అయిపోయేరు. ఇవతల కొడుకులు చూస్తే ముదిరిపోతున్నారు.

గూటాలనించి చుట్టంచూపుకి మావూరొచ్చిన షావుకార్ల మాణిక్యంగారు పాపికొండల ముందు తగిలే శివగిరిలో గుడిపూజారి శ్రీపాదపట్టాభిగారమ్మాయి ఉందని చెపితే రాజమండ్రి వెళ్ళి అక్కడ తెల్లవారుఝాము నాలుగున్నరకి బయల్దేరే కూనవరం పాసింజరు లాంచీ ఎక్కి మధ్యానానికి శివగిరిలో దిగేడు శాస్త్రిగారు.

అది మారుమూల గ్రామం అవడం వల్ల పట్టాభిగారింట్లోనే భోజనం చేసి అమ్మాయిని చూసేడు.

పిల్ల అందంగా బాగుంది కానీ, పట్టులంగా ఎంత ఎగ్గట్టి ఎంత దాచే ప్రయత్నం చేసినా నడుం మీద తెల్లటి బొల్లిమచ్చ సూరయ్యశాస్త్రి కళ్ళ బడిపోయింది. తనకి అంతే కనబడింది. ఒళ్ళంతా పాకుతా పోయే ఆ మచ్చ లోపలింకా ఎంతుందో అనుకున్న శాస్త్రి "పసలపూడెళ్ళి పిల్లల్తో మాటాడేక కబురుచేస్తాను బావగారూ" అని జెప్పి రేవులో కొచ్చేసరికి సాయంత్రం నాలుగు దాటింది. మరో గంటక్కానీ రాలేదు కూనవరం వేపు నించొచ్చే లాంచీ.

లాంచీలో కూర్చున్న శాస్త్రి బుర్రతిరిగి పోయింది. గుండెకాయ ఒక్కసారి ఆగి మళ్ళీ కొట్టుకోడం మొదలెట్టింది. పుల్లల్లాంటి కాళ్ళు గడగడా వణికినియ్యి. లాంచీ నిండా ముప్పైమంది ఆడోళ్ళు. కిలకిల నవ్వుతున్నారు. దగదగా మెర్సిపోతున్నారు. వాళ్ళు రాసుకున్న రకరకాల అత్తరు వాసన్లు వాళ్ళ దగ్గర్నుంచి గోదారి గాలిలో కల్సి ఇటు పక్క కొస్తున్నాయి.

నిన్న శ్రీరామనవమికి భద్రాచలంరాములోరిగుళ్ళో ఆట గట్టడానికెళ్ళిన రెండు మేళాల జనవంట ఆళ్ళు. రంగురంగుల శిల్కుచీరలూ, ఖరీదైన నగలతో కళకళ్ళాడిపోతా ఎవరికీ దేనికీ భయపడకండా సుఖంగా, హాయిగా మాటాడుకుంటున్నారు. జున్నుముక్కల్లాగా జొన్నపొత్తుల్లాగ ఉన్నారు. గాలికి ఊగే ఉమ్మెత్త పువ్వుల్లాగ, పొట్టలు వెయ్యడానికి ముందుండే పచ్చటి వరిచేలల్లాగా ఆనందంగా ఊగిపోతున్నారు.

వాళ్ళంతా ఒకెత్తూ రేడియోలో పాటలు వింటా ఓ మూల కూర్చున్న అనంతలక్ష్మి ఇంకో ఎత్తులాగ అనిపించింది సూరయ్యశాస్త్రికి. ఎందుకంటే ఆ అనంతలక్ష్మి తక్కినోళ్ళలో కలవటం లేదు. పచ్చకర్పూరమేసిన తమలపాకులు నముల్తా నాలిక పండిందో లేదో చూసుకుంటున్న అనంతలక్ష్మిని "నాలికెందుకే అలా చూసుకుంటున్నావ్?" అనడిగింది మేళం నాయకురాలు రత్నపాప.



“పండితే మంచి మొగుడొస్తాడంటారు గందా?” అంది అనంతలక్ష్మి.

నవ్విన రత్నపాప “మనకి మొగుళ్ళేంటే ఏవన్నా కల గంటన్నావా బుల్లీ?” అంది. వాళ్ళకి భర్తలుండరు. కానీ, ప్రతి ఆడమనిషిమెళ్ళోనూ మంగళసూత్రాలుంటాయి. ఆటిని వాళ్ళకులంలో పెద్దావిడ కడద్దంట ఆ తాడు. ఇదంతా అనంతలక్ష్మికి ఇంకోసారి గుర్తు చేసింది నాయకురాలు రత్నపాప.



“సరే ఇదే వృత్తిలో వుంటే నువ్వు చెప్పినట్టు జరుగుద్ది. ఎవర్నైనా పెళ్లి చేసుకుంటే నేననుకున్నట్టు అవ్వుద్ది గదా?” అంది అనంతలక్ష్మి.

లాంచీ పడిచెక్క మీద నిలబడున్న సూరయ్యశాస్త్రి చెవులోకి దూరినియ్యామాటలు. అతని భార్యపోయి అయిదేళ్ళు దాటింది. దాంతో, అనంతలక్ష్మి గురించి తెగ ఆలోచించడం మొదలెట్టేడు



సూరయ్యశాస్త్రి.

జనాన్నీ లగేజీ బాగా ఎక్కించేసి లోడు బాగా పెంచెయ్యడంతో చాలా కష్టంగా నడుస్తుంది లాంచీ. డుబ్ డుబ్ డుబ్ మన్న ఇంజను చప్పుడుతో పాటు గ్లగ్ గ్లగ్ గ్లగ్ మన్న గుల్ల చప్పుడుకూడా వినిపిస్తుంటే చిన్న డౌటొచ్చింది సరంగు గంగరాజుకి చూద్దారిలే అయినా ఇప్పుడేం చెయ్యలేం గదా? అనేసి ఊరుకున్నాడు.

తొమ్మిదో నెల మోస్తున్న గర్భిణీమనిషిలాగా చీడూరు, టేకూరు, తూటిగుంట దాటిన లాంచీ పిట్లుకొండ దగ్గర కొచ్చేసరికి ఇంజను రూంలోంచి పొగలొచ్చెయ్యడం మొదలెట్టినియ్యి. పరుగెత్తుకెళ్ళిన సరంగు గంగరాజు ఇంజనాపేసేడు.

''ఏవయిందిరా సరంగూ?'' పరుగెట్టుకుంటా వెళ్ళి అడిగేడు లాంచీ షావుకారు.

''ఏమోనండి చూస్తుంటే పెద్ద రిపేరులాగే వుంది'' అన్నాడు గంగరాజు.

''లాంచీ నిండా ఫుల్‌లోడు ఎక్కించేసేం ఇప్పుడెలాగరా?'' అడిగేడు లాంచీ షావుకారు.

''నాలుగు పిస్టన్ల లెలేండ్ ఇంజను. దాన్ని ముట్టుకోడానికి మేమెవరం సరిపోం. రాజమండ్రినించి మెకానికరు రావాల్సిందేనండి'' అనేసేడు.

రెండుమూడు రెంచిలు తీసుకున్న లాంచీషావుకారు అదీ ఇదీ విప్పి కెలికేడుగానీ ఏమాత్రం సెట్టవ్వలేదు. ఇంజను స్టార్టవ్వలేదు.

లాంచీలో పనిచేసే తక్కినోళ్ళంతా గెళ్ళేసి దగ్గర్లో ఉన్న తిప్ప పక్కకి మళ్ళించేరు లాంచీని.

''ఇదిగో ఏవండీ...లాంచీ రిపేరొచ్చిందండి. ఈ రాత్రికి మన మకాం ఇక్కడే మరి...'' పాసింజర్లతో అన్నాడు లాంచీలో వంటలు చేసే నాగన్న.

ఆ లాంచీలో రకరకాల జనం ఉన్నారు. అందరికంటే మేళాల జనవే ఎక్కువగా ఉన్నారు. ఓ పక్కనించి చూస్తుంటే గాలి పెరిగిపోతుంది. దీపాల వేళవుతుంది. తల పైకెత్తి చూస్తే గోదారితల్లికి ఎడాపెడా ఉన్న కొండలమీద పోడు వ్యవసాయం చేసే కొండోళ్ళు కొండలమీద అడివిని కాలుస్తున్న మంటలు గాలికి భగభగా మండుతున్నాయి.

మేళాల నాయకురాళ్ళు రత్నపాప, కాంతామణి నీళ్లలోకి దిగి తలారా స్నానం చేసి గోదారి తల్లికి దణ్ణపెట్టుకుని లాంచీ వెనకున్న వంటగదిలో పొయ్యి వెలిగించి ఎసరు పెట్టేరు.

బుల్లిపాప, పెద్దపాప అనే ఇద్దరు అమ్మాయిలు పోలవరం రేవులో అమ్ముకుందావని కూరగాయలు పట్టికెళ్తున్న గిరిజనుల దగ్గర్నించి రెండు ఆనబగాయలూ, పాతిక ములక్కాడలూ తీసుకుని తరగడం మొదలెట్టేరు. టౌన్నుంచొచ్చి కొండోళ్ళ దగ్గర పరమచవగ్గా కొనుక్కు పట్టుకుపోయి రాజమండ్రిలో వ్యాపారం చేసే మనిషొకడు లాంచీలో వున్నాడు. అతని దగ్గరకెళ్ళి కుంచెడు కందిపప్పూ, చింతపండు బుట్టలో పెద్ద పెళ్ళా లాక్కున్నారు కమలా, సరోజినీ. మాచరమ్మ అనే మనిషి దగ్గర ఎండు చేపల బుట్ట మొత్తం లాగేసుకున్న వెంకటలక్ష్మి వాటితో సవ్వాదిగా ఇగురొండుతుంది. ఇంకో పక్కనించి లాంచీ సరంగు గంగరాజు గేలమేసి తగిలిన చేపల్ని తగిలినట్టు ఆడోళ్ల కిస్తుంటే ఆళ్ళు వాటిని శుభ్రం చేసి నూనెలోవేపి ఉప్పుకారం జల్లుతున్నారు. నాలుగు పులుసు చేపలు గేలానికి దొరికితే మట్టిదాకలో పులుసెడ్తుంది సూరేకాంతం అనే అమ్మాయి.

ఇంతమంది ఆడోళ్ళు మగోళ్ళు ఇంత కష్టపడ్తుంటే ఏ పనీ చెయ్యకుండా షోగ్గా లాంచీ పైకెక్కి టాపుమీద పరిచి ఉన్న లాంచీ షావుకారు పరుపు మీద బోర్లాపడుకుని తేగలు ఒల్చుకుని నములుతూ కాళ్ళూపుతా రేడియోలో వస్తున్న పాటలు వింటంది అనంతలక్ష్మి. నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ- ఈనాటి ఈబంధ మేనాటిదో - మల్లెలలో వెన్నియలూ వెన్నెలలో గుసగుసలూ అలాగ తన కిష్టమైన పాటలన్నీ వస్తున్నాయి. అవి వింటా ఆ పాడేది తనే అయినట్టు తన పక్కన ఒక అందమైన రాకుమారుడి లాంటి భర్త ఉన్నట్టూ ఊహించుకుంటుంది. అయితే ఎవరికి వాళ్ళు ''ఈ పన్లన్నీ అలవాటు లేని మనిషి అనంత'' అనుకుంటా చేసుకుపోతున్నారు తప్ప అనంతకేమీ బెత్తాయించడం లేదు.

వాళ్ళ మాటలు వింటా అనంతలక్ష్మినే చూస్తున్నాడు సూరయ్యశాస్త్రి.

బాగా పొద్దుపోయింది.

గురు పౌర్ణమి. ఆకాశంలోకి చంద్రుడొచ్చేడు. గాలి మందంగా వీస్తుంది. కొండలమధ్య గ్రామంలోంచి జానపదాలు వినిపిస్తున్నాయి. అట్నుంచీ ఇట్నుంచీ వచ్చిపోతున్న పడవల్లో లాంతర్లు వెలుగుతున్నాయి.



వంశీ మా పసలపూడి కథలు-72

నెమ్మదిగా నడుచుకుంటా వెళ్ళి లాంచీ టాపెక్కిన సూరయ్యశాస్త్రి అనంతలక్ష్మి దగ్గరకెళ్ళేడు.

* * *

కొడుకుల్లో ఒకడికి పిల్లని చూసి రావడానికెళ్ళిన సూరయ్యశాస్త్రి అనంతలక్ష్మిని ఊళ్ళోకి తీసుకొచ్చేసరికి గగ్గోలయ్యింది. ఊరంతా తెగ జెప్పుకోడం మొదలెట్టేరు.

ఆ ఇంట్లో ఒకరోజు గడిచేక ''ఎదిగిన మీ అబ్బాయిల్తో ఇక్కడుండటం కష్టంగా ఉంది నాకు. వేరే ఇల్లు చూడ''మని అనంతలక్ష్మి అంటే బంద్రేవు గట్టుమీద కోఠ్రాములుగారి ఇజీలచ్చుంగారింటి పక్కన ఇంకో ఇల్లు చూసేడు. వంటమనిషి కావాలంటే పెట్టేడు. కాళ్ళు పిసకడానికి మనిషి కావాలంటే పెట్టేడు. అనంతలక్ష్మి ఏం గావాలంటే అది చేస్తున్నాడు.

అనంతలక్ష్మి పసలపూడొచ్చి సరిగ్గా నెలయ్యింది.

ఆవేళ పౌర్ణమి.

దొడ్లో మునగచెట్టు కాడలే తప్ప అసలు ఆకుల్లేవు. గాలికి ఊగే జామిచెట్టు కొమ్మలు, పంపర పనాసచెట్టు, పొలసపోటా చెట్టుకొమ్మలు ఊగుతున్నాయి గాలికి.

తల మీంచి వేడీళ్ళు స్నానం చేసి లోపల బాడీ లేకుండా గ్లాస్కో జాకెట్టు, చీరా కట్టుకొచ్చిన అనంతలక్ష్మి ఆవునేత్తో జీడిపప్పేసి చేసిన ఉప్మా, స్టీలు పళ్ళెంలో పోసుకుని, దాని అంచున గుప్పెడు పంచదార వేసుకుని ఉప్మా ముద్దల్లో అద్దుకు తిన్నాకా, పెరట్లో కొచ్చి, ఆకివీడు నవ్వారు మంచం మీదేసిన పరుపు మీద అడ్డంగా పడుకుంది.

చాలా రాత్రయిపోయింది.

ఊరు మాటు మణిగిపోయింది.

వెన్నెల్లో దూరంగా కనిపిస్తున్న పంట పొలాల్లో చిక్కటి మంచు కురుస్తుంది. ఈపొలాల మధ్యలో ఉన్న బోరింగుపెడ్లో దీపం వెలుగుతుంది.

ఆ చల్లటి వెన్నెలరాత్రి రేడియోలోంచొస్తున్న పాటలు వినడం మొదలెట్టింది అనంతలక్ష్మి. దీపాలు పరదాలు తొలగె ప్రియురాలు పిలిచె రావోయీ.... గుండె ఝల్లు మన్నదీ అందె ఘల్లుమన్నదీ ....తెలిసిందిలే..తెలిసిందిలే నెలరాజా నీరూపు..తెలిసిందిలే-మోహనరాగ మహోమూర్తి మంత్రమాయే- జగమే మారెనుగా మధురముగా ఈ వేళా ఆ పాటలన్నీ వింటా ఆ పాడేది తనే అయినట్టూ తన పక్కన ఒక అందమైన నాయకుడున్నట్టూ ఊహించుకుంటుంది అనంతలక్ష్మి.

కాస్సేపయ్యేకా నూరు నెంబరు పంచె, మెట్టూరు మల్లు లాల్చీ మీద పిఠాపురం నూర్జహాను మొగలి అత్తరు రాసుకొచ్చేడు గరిమెళ్ళసూరయ్యశాస్త్రిగారు.

అతన్ని చూసిన అనంతలక్ష్మి అదోలాగయిపోయింది. అతన్లో తన రాకుమారుడ్ని చూసుకోడం చాలా కష్టమైపోయింది అనంతలక్ష్మికి.

* * *

అనంతలక్ష్మి యావలో పడిపోయిన తండ్రి తమ పెళ్ళిళ్ళ సంగతి పక్కనెట్టేసరికి ఆ నలుగురు కొడుకులూ ఒకోడూ చప్పున ఊళ్ళోంచి జారిపోయేరు.

ఒకరోజు,

"ఈ పడిపోతున్న పాటిమట్టిగోడల ఇల్లు వద్దు గాలిమేడ కావాలి నాకు" అంటే వెలగల గోపాలంగారి దొడ్డంతా కొనేసి ఒక గాలిమేడకి పునాదులు వేయించడం మొదలెట్టేడు శాస్త్రిగారు.

ఫలానా చీరలు కావాలని, పని గట్టుకుని బండార్లంక తీసుకెళ్ళి జరీ అంచు చీరలు నేయించుకుంది. అద్దంపల్లి వెళ్ళి తనకి ఫలానా డిజైన్ల దుప్పట్లు కావాలని నేయించుకుంది,

ఒకోసారి అర్జంటుగా చిన్నకారు కట్టించుకుని కాకినాడెళ్ళిపోయి మసీదు సెంటర్లో ఉన్న అలంకార్ హోటల్లో పలావు తిని, జిలానీ కట్టిచ్చిన కిళ్ళీ వేసుకుని, సత్యం మిఠాయికొట్లో వీసెడు కరకజ్జం కొనుక్కొని వెనక్కొచ్చింది.

పూర్తవుతున్న గాలిమేడ దగ్గరకొచ్చి తను అడిగినట్టుగానే వెడల్పుగా కడ్తున్న తన గది ఇంకా ఎలగెలాగుండాలో చెప్పింది. గదిలో ఓ గోడంతా అద్దమే ఉండాలని నేలమీద నల్లగచ్చు వద్దనీ పాలరాయి పరిపించమనీ, అద్దాల కిటికీల్లోంచి బయటిజనం తనకి కనబడాలని తను మట్టుకి బయటోళ్ళకి కనపడకుండా ఉండే అద్దాల్ని బిగించమని ఇలా రకరకాల కోరికలు కోరింది అనంతలక్ష్మి. ఆ మనిషిఏవడిగితే అది పలపరుస్తున్నాడు సూరయ్యశాస్త్రి.

ఒకరాత్రి ఏదో అయ్యినదాన్లాగా పరుపుమీద పడుకున్న అనంతలక్ష్మి గభీల్మని లేచిపోయింది. అన్నీ సమకూరుస్తున్నాడు సూరయ్యశాస్త్రిగారు. కానీ, ఇయ్యేం లేకపోయినా పర్లేదు. అసలు కావాల్సిన తనకి జోడా అయిన ఆ మనిషేడి? తన ఊహల్లో ఆ రాజకుమారుడేడి. ఏదిలేకపోయినా పర్లేదు అతను మట్టుకి ఉంటే చాలు. మరా మనిషేడీ???

* * *

గాలిమేడ పూర్తయ్యింది.

ఇక ఆనాకో, రేపో గృహప్రవేశం జరగబోతుంది. ముహుర్తంకోసం బ్రేమ్మలు ఎర్రబ్బాయి గారింటికెళ్ళేడు సూరయ్యశాస్త్రి. అదేరోజు అర్ధరాత్రి యవ్వనంలో ఉండి తనకి సరయిన జోడా అనుకున్న కూర్మాపురంలో పాలచర్లవెంకట్రామయ్యగారి మేనల్లుడు బంగారిబాబుతో ఎక్కడికో దూరప్రాంతాలకెళ్ళిపోయింది అనంతలక్ష్మి. అయితే ఆ వెళతా... వెళతా సూరయ్యశాస్త్రి వస్తువుల్లో చీపురు పుల్లముక్కకూడా పట్టికెళ్ళలేదు. రాత్రి తను కట్టుకున్న శాస్త్రిగారు కొన్న చీరానగలూ ఆఖరికి బాడీ తల్లో సవరంతో సైతం పడగ్గదిలో ఒకమూల కుప్పలాగ పడేసెళ్ళింది. ఊరు వచ్చేటప్పుడు ఏ బట్టలు కట్టుకొచ్చిందో ఆ బట్టలే కట్టుకెళ్ళిపోయింది అనంతలక్ష్మి.

చాన్నాళ్ళు గడిచిపోయినియ్యి.

ఇంట్లో ఆడమనిషి లేకపోడం వల్ల సత్యన్నారాయణమూర్తి వ్రతం, గృహప్రవేశం జరక్కపోడంతో బోసిపోతా ఇప్పటికీ అలాగే ఉండిపోయింది పూర్తయిన ఆ గాలిమేడ.

* * *